3707

# మైథిలి

పదకొండు గంటలప్పుడు ఇల్లు చేరేటప్పటికి తలంతా తిరుగుతున్నది. నాలుక తడి ఆరిపోతున్నట్లనిపించింది. నిలుచోలేక పోతున్నాను. ఎలాగో నా గది చేరుకుని, కోటు వంకెన తగిల్చి, పక్కమీద కూలబడిపోయాను. ఇల్లంతా కోలాహలంగా వుంది. నడిమి హాలులోనుంచి ఎడతెగకుండా ప్రవహిస్తున్న బ్రాహ్మణులు, మంత్రాలు కాని, వంటఇంటినుంచి వస్తున్న వాసనలు కాని, నాలో నిర్వీర్యమైన ఆసక్తిని రెచ్చగొట్టలేక పోతున్నాయి. ఇదివరలోనైతే ఆ వాసనలు వేటి తాలూకో, అని, వీళ్లు చదివే మంత్రాలు ఏదేవుణ్ణి గురించి అనికాని వ్యర్థమైన కుతూహలంతో ఆలోచిస్తుండేవాణ్ణి. ఆఫీసులో వుండగానే నా తల తిరగడం మొదలైంది. కాఫీ తెప్పించుకుంటే రుచించలేదు. సిగరెట్ పొగ విపరీతమైన అసహ్యం రగుల్కొల్పింది. పని చేసుకోలేక సతమతమయ్యాను. ఇలాటి పరిస్థితులలోనే ఇల్లు చేరుకున్నాను.

అక్కయ్య పిల్లలు గోలగోలగా అరుస్తూ ఇల్లంతా తిరుగుతున్నారు. నడుమ నడుమ పెద్దవాళ్లు వాళ్లను కసురుకుంటున్నారు. తొమ్మిదేళ్ల రమ నా గదిలోకి జొరబడి కాగితాలు టేబులుమీద గిలికేస్తున్నది.

"ఎందుకే ఇక్కడికొచ్చావు?" అన్నాను.

ఒక్కసారి వులిక్కిపడి "నువ్విక్కడే వున్నావయ్యా, దొంగమావయ్యా, ఇంకా నువ్వాఫీసునుంచి ఎప్పుడొస్తావో

స్తావా, అని మేమంతా ఎదురుచూస్తున్నాం." అంది వయ్యారంగా దగ్గరికి నడిచివచ్చి చొక్కా కాలరు నలుపుతూ. "కత్తిర కావాలి మామయ్యా" అంటున్నది.

నేను దానిమాట తప్పించి "మేమంతా, అంటే ఎవరెవరే" అన్నాను.

"మేమంటే మేమే, ఇంట్లోవాళ్లం" అన్నది రమ.

"అంటే ఎవరెవరని?"

"అత్తయ్య నన్నిప్పటికి పదిసార్లు వీథిలోకి పంపించింది, నువ్వొస్తున్నావేమో చూడమని. నువ్వేమో చల్లగా ఇక్కడొచ్చి కూచున్నావు?"

"ఎందుకో కనుక్కోలేక పోయినావ్వా?"

"ఏమో మరి, అయినా అడిగిరానా?"

"వద్దులే, మరి నువ్వుకూడా ఎదురు చూస్తున్నావా?",

"నాకు తెలీదు బాబో, కత్తిర ఎక్కడుందో చెప్పు. అవతల ముహూర్తం వేళమించి పోతూంది. సీతాయి కేక వేస్తుంది ఇక. దాని కొడుక్కి నా కూతుర్ని ఇచ్చి పెళ్లి చేస్తున్నాం. పెళ్లి కూతురికి పూలజడ వేయాలి మామయ్యా. కత్తిర ఇయ్యావా, రంగు కాయితాలు కత్తిరించాలి" రమ గునుస్తోంది.

దాని వాలకం చూసేటప్పటికి నాకు ఆపుకోలేని నవ్వొచ్చింది.

"అయితే మరి కట్నమెంతే?" అని అడిగాను.

"కట్నమూ లేదు, కానుకా లేదు. వాళ్ల పిల్లవాడికి మాపిల్లనచ్చింది అంతే ఇక పెళ్లి చేస్తున్నాం" అంది పెద్దనావ సానిలా చేతులు తిప్పుతూ.

"ఆసి, నీ యిల్లు బంగారం గానూ. కట్నం ఇయ్యకుండా పెళ్లిచేయటం మహాపాపం. ఇదిగో యీ రూపాయి తీసికెళ్లి కట్నం చదివించు."

రూపాయి తీసుకొని రమ పరుగెత్తుకు వెళ్లిపోయింది. నిండా దానికి తొమ్మిదేళ్లు లేవు. పిల్లనచ్చటమంటే దానికి ఏమిటి తెలుసు? కొంపదీసి వాళ్ల కుర్రికుంక మా కుర్రి నాగమ్మని ప్రేమించాడనో చెప్పలేదు. కత్తెర సంగతి మరచి పోయింది తొందరలో, పైన రూపాయి చేతికొచ్చిన సంతోషం అంతా ఇంతా కాదు.

మా అక్కయ్య కూతురు రమ కూతురు పెళ్లి తాలూకు బాజాభజంత్రీలు చెవులతుప్పు వదల గొట్టేస్తున్నాయి, రేకు డబ్బావోటి పుచ్చుకుని వాయిస్తున్నాడు మేళగాడు. నోటితో పే సన్నాయివాయిద్యం వాయిస్తున్నాడొకడు. ఓ పదినిమిషాల తర్వాత ఆ సందడి తగ్గింది. ఎలా అయితేనేం నా మనవరాలి (రమకూతురు) పెళ్లి సలక్షణంగా జరిగి పోయిన సూచనలు కాన వచ్చినై. నేను సిగరెట్ కాల్చుకుంటూ, కిటికీలోనుంచి [illegible] మబ్బుల్నీ, దూరంగా అవపడే రైలు పట్టాలనీ చూస్తూ పడు కున్నాను. మెట్లమీద ఏదో అలికిడి అయితే యింతలో లేచి

కూచున్నాము సరోజ కాదు. రమ. నూత్న దంపతులను నాకు మొక్కించడానికి ఎత్తుకొచ్చింది. అవును! రూపాయి మహిమ! పోయేప్పుడు వాళ్ల భోజనాల తాలూకూ కాసిని కందిపప్పూ కాస్త చింతపండు నా చేతిలో పెట్టి మరీ పోయింది రమ. రమ అలా వెళ్లి పోగానే, నా చేతిలోని భోజ్యాల కోసం కాచుకుని వున్న మేనల్లుడికి ఇచ్చేసాను వాటిని. వాడు ముఖమింత చేసుకుని, నోరింత చేసుకుని వెళ్లిపోయాడు. ఎలా అయితేనేం, సీతాయి అత్తగారూ అయింది. రమ కూతురిచెరా వదిలించుకుంది. నాకు నవ్వొచ్చింది. వీళ్లు పెళ్లిళ్లు ఇంత తేలిగ్గా చేస్తున్నారు. హాయిగా ఆడంబరం లేకుండా.

వెచ్చటి గాలి తగులుతుంటే కిటికీ రెక్కలు సగం మూశాను. మళ్లీ నీరసంతో పక్కమీద ఓరగిల బడ్డాను. గోడ మీద గడియారం ఒంటి గంట చూపిస్తున్నది. ఎవ్వరూ నన్ను చూసే వాళ్లేలేరు. ఎవరి పనులలో వాళ్లు తల మునకలవుతున్నట్లున్నది. నడిమి హాలులో బ్రాహ్మణులు మంత్రాలు ఆపేసి భోజనాలలో పడ్డట్లుంది. మరి గడబిడ తగ్గింది. వాళ్లు భోజనాలు చేసి లేస్తేగాని సరోజ నన్నుచూడటానికి రాదు. వాళ్లకేం తెలుస్తుంది నాబాధ. సెంట్రల్ క్యాబినెట్‌లో మంత్రుల నియామకం గురించి మాట్లాడుతూ నడుమనడుమ గారె ముక్కలు విరుచుకుంటూ సరోజ చేత, ఇంకాస్త వేయించుకొండి అని బతిమిలాడించుకుంటూ భోంచేస్తున్నారు. నాకుభోజనం తొందరగా వుంది, తలకాయ విపరీతంగా పగిలిపోతున్నది.

సరోజ వొక్క-సారైన యీ వేపు రాలేదు. ఏం వ్రతమో ఏం ఉద్యాపనో. ఇవాళ నాతల పగిలి పోతోంది. వాళ్లుకూడా వెచ్చగా వుంది. సరోజకు రమచేత కబు రంపవచ్చు. కాని ఆదరా బాదరా పరిగెత్తుకొస్తే అవతల వ్రతమంతా చెడిపో వచ్చు. అలానే మెదలకుండా పడుకున్నాను.

అలా ఎంత సేపు గడిచిందో, మెట్లమీద పరిచితమైన పద ధ్వని వినిపించింది. ఇంతలోనే, 'ఇప్పుడు మీరు పడుకు న్నారేం, వొంట్లో బావుందా, లేవండి, లేవండి' అన్నదిసరోజ. నేను సరోజవేపు చూశాను. ఎప్పుడో పెళ్ళినాడు పెట్టిన పట్టు చీర వంటినిండా చుట్టేసుకుంది. కట్టుకోవటంకాదు, చుట్టుకోవ టమే- పసుపు పచ్చ రంగు పట్టుచీర, మామిడి పిందెల అంచు రమ కూతురికి గౌను తొడిగితే ఎలా వుంటుందో, అలా వుంది సరోజ పట్టుచీరలో. బొట్టు కరిగి ముక్కు-మీదికి జారు తున్నది.

'మీ బ్రాహ్మణులు భోంచేసి పోయారా' అన్నాను.

సరోజ అదే పనిగా నవ్వింది.

'అప్పుడే ఎలా, ఇంకా కొద్ది పనివుంది. మీరు లేచి చప్పున స్నానం చేసి మడి కట్టుకుంటే, వాళ్లకు వాయనాలిచ్చి పంపించవచ్చు. మీకు చాలా ఆలస్యమైంది, ముఖం అలా వాడిపోయిందేం?'

"ఇప్పుడు నేను స్నానం చెయ్యాలా?"

"నా కోసం మిమ్మల్నింక బాధ పెట్టనుగా."

"ఇప్పుడు నేను స్నానం చెయ్యలేను సరూ."

"అలా అయితే, చేసిందంతా వ్యర్థమైపోతుంది. చప్పున మూడు నిముషాల్లో అయిపోతుంది, లేవండీ" అంది సరోజ.

నన్ను తాకటానికి సంకల్పించి, ఇంతలో మడిగట్టుకుని వున్నానన్న సంగతి గుర్తొచ్చి వుండటంవల్ల కాస్త దూరంలో నిల్చుని నవ్వుకుంది.

"ఆఫీసుకీ పూటకి సెలవు రాసి పంపించండి" అంది.

"ఆ పని యీ వరకే అయింది" అన్నాను.

"మరి లేవండి" అన్నది సరోజ.

"వస్తున్నాను పద."

సరోజ వెళ్ళిపోయింది.

రమ తుండుగుడ్డలు బుజాన వేసుకుని, "నీళ్ళు తోడి పెట్టానురా, మామయ్యా" - అంది వచ్చి.

నేను వెళ్లి స్నానం చేసి వచ్చాను.

తర్వాత సరోజ పక్కనే నిలబడి ఇష్టంలేకపోయినా ఒకొక్కరి కాళ్లకే మొక్కి రూపాయి రూపాయి సమర్పించుకోవాల్సి వచ్చింది సరోజ సంతృప్తికోసం. కేవలం సరూ సంతృప్తికోసమే. నాకు నమ్మకమూ తక్కువ, పైన వాళ్ళ వ్యక్తిత్వంమీద గురిలేదు. ఏమైతేనేం సరోజ సంతృప్తిగా నిట్టూర్చింది. వాళ్లు వెళ్లిపోయారు.

నేను అలానే వచ్చి మళ్లీ పడుకున్నాను. కొద్దిగా చలి అన్పించింది. పదినిముషాల్లోనే చలి ఎక్కువై కప్పుకుని పడుకోవలసి వచ్చింది.

అరగంట గడిచిన తర్వాత రమ కాబోలు దుప్పటి తొలిగించి, నా ముఖంలోకి చూస్తూ, "అత్తయ్య పిలుచుకు రమ్మంటోంది" అంది.

"అత్తయ్యను ఓసారి ఇలారమ్మని చెప్పమ్మా" అన్నాను. రమ వెళ్ళిపోయింది.

రమ ఏమని చెప్పిందో, సరోజ ఆదరాబాదరా వచ్చేసింది.

"ఏమండీ" అంది గుమ్మంలోంచే.

ఆ కంఠంలో విహ్వలత, ఆ మనసులోని వ్యాకులత నా కళ్లు తెరిపింప చేశాయి.

సరోజ అప్పుడే నా గుండెలమీద చెయిపెట్టి చూస్తున్నది. నా పక్కనే కూచుంది.

"నా ఖర్మ, నా గ్రహచారం, నేను ఏదిపెట్టుకున్నా ఇలా కావల్సిందే, లేకపోతే ఏమిటి? క్షణాలమీద జ్వరం పెట్టుకరావాలా..." సరోజ కంఠం బొంగురుపోయింది.

"వాళ్లంతా భోజనాలు చేశారా? అని అడిగాను.

"లేదండీ, మీ కోసమే చూస్తున్నాను. రమ వచ్చి "మామయ్య ముసుగెట్టుకుని నిద్రపోతున్నారు" అని చెప్పింది. అప్పుడే అనుకున్నాను మళ్ళీ నా కేదో పరీక్ష ప్రారంభమైనదని. నేను భగవంతుడికి ఎంత దగ్గరిగా పోవాలని చూస్తున్నానో, అంత దూరమవుతున్నాను. నా కింక ఏ వ్రతాలు వద్దు, ఏ పూజలూ వద్దు..."

"వెళ్ళి భోజనం చేసిరా సరూ" అన్నాను నేను కల్పించుకుని. మూడు కావస్తోంది.

నా వైపు కసిగా చూసింది సరోజ. ఒంట్లో బాగులేక పోతే చెప్పకూడదూ, పైన నెత్తిన స్నాన మెందుకు చెయ్యాలి? నా కెలా తెలుస్తుంది మీ వంట్లో సరిగ్గా లేదని, నా ఖర్మ నే నలా అనుకోలేదు. మీరు స్నానం చెయ్యాలా అంటుంటే బద్ధకం అనుకున్నాను."

కొంగు చేతికి తీసుకుని, ముఖంతొడుస్తూ "వెళ్ళి భోంచేసి రద్దూ" అన్నాను.

సరోజ లేచే సూచన లేం కన్పించటంలేదు.

"మూడు దాటింది. లేలే" అన్నాను.

"ఏమిటీ తొందర, ఎప్పుడో ప్పుడు చెయ్యొచ్చులే" అంది.

రమ మళ్ళీ పరిగెత్తుకొచ్చింది "అమ్మ పిలుస్తున్న దత్తయ్యా" అంటూ.

"అమ్మను భోజనం చెయ్యమను రమా, అత్తయ్యకొద్ది సేపుండి వస్తుందని చెప్పు అన్నది" సరోజ.

రమ మళ్ళీ పరిగెత్తు కెళ్ళింది.

కాని సరోజ ఏమని ఊహించిందో అలా జరగలేదు.

అక్కయ్యవచ్చి ఆ స్థితిలో మమ్మల్ని—చూసింది. సరోజ లేచి క్రింద నిలబడి, "చూడు వదినా, యీయనకి జ్వరం వచ్చింది" అన్నది.

"అంత గాభరా పడాల్సిన దేముంది సరూ, సాయంకాలానికి అదే తగ్గిపోతుంది" అంది అక్కయ్య.

అక్కయ్య కూడా నా వొళ్ళు చూసింది.

"అబ్బే. ఇట్టే తీసిపోతుందిలే" అన్నది.

కాని యీ సంభాషణ సరోజను తృప్తిపరచలేకపోయిందన్న విషయం సరోజముఖంలో పరిస్ఫుటంగా కనబడుతున్నది.

అక్కయ్య, సరోజతో క్రిందికి వెళ్ళిపోయింది. నేను కళ్ళు మూసుకుని సరోజనే ధ్యానిస్తున్నాను. కాని, నా ధ్యానాన్ని రమ చెడగొట్టింది.

"మామయ్యా, కత్తెర ఎక్కడుందో - చెప్పవూ" అంటూ వచ్చింది.

"ఎందుకే అన్నాను."

"పెళ్ళి కూతురికి పూలజడ వెయ్యాలి మామయ్యా. పొద్దున అత్తయ్య రంగు కాగితాలు కత్తిరించి ఇస్తానంది. సీతాయి రంగు కాయితాలు తెచ్చింది. ఎక్కడుంది మామయ్యా.

"అత్తయ్య ఇప్పుడు నీ మాట లేపి పట్టించుకోదు" అన్నాను.

అయితే, అమ్మనడుగుతా, లేకపోతే సీతాయికి చేతనవును లే, అస లేది. . ."

అలమారలో వుంటుంది చూడు. లేకపోతే అత్తయ్యనడుగుదువుగాని,"

రమ కత్తెర తీసుకుని వెళ్ళిపోయింది.

ఎండగాడ్పు ఉక్క కలిగిస్తోంది.

దుప్పటి తొలగించి కళ్ళు మూసుకుని పడుకున్నాను.

ఈ ఆత్మవంచనకు అంతంటూ లేదు

సరోజ నాకెంత దగ్గరకు వస్తున్నదో తలుచుకొంటుంటే నాకు భయం పుడుతోంది. నేను సరోజకు దగ్గర కాలేకపోతున్నాను. ఈ సంకెళ్ళు దృఢతరమయ్యే కొద్దీ నాకు ఆత్మశాంతి వుండదు. కాని, సరోజ నా ఇంటికి వచ్చినప్పటి కంటే ఇప్పుడు మరీ సన్నిహితురాలైంది. సన్నిహితురాలు కాకూడదని కాదు. యౌవన దశలో జీవితం నాకు భయంకరమైన పరిస్థితులను సృష్టించి, ఎడతెగని సంశయంలో బంధించి నన్ను నిర్ధనుణ్ణిగా చేసింది. తన్మూలంగా ఒకటి రెండు సంవత్సరాలు నేను పూర్తిగా ఉన్మాదినైనాను.

కాని, ఈ విపత్కర పరిస్థితులలో నేను మళ్ళీ మనిషిగా జీవించడానికి మా అమ్మ దోహదం చేసింది. అందువలననే సరోజ నాకు అర్ధాంగి అయింది. నేను ఇలాంటి జీవితాన్ని ఇచ్ఛగించలేదు. కాని, విధి నన్ను ఒక ఇంటివాణ్ణి చేసింది.

సరోజ నా ధ్యానాన్ని భంగం చేసింది.

"నిద్రపోతున్నారా?" అంది.

"లేదు నిన్నే ధ్యానిస్తూ పడుకున్నాను. ఇంత ఆలస్యం చేశావేం?"

నా మాటలు నాకే ఆశ్చర్యాన్ని కలిగించాయి. నేను ఆత్మవంచన చేసుకుంటున్నాను. తెలిసి తెలిసి ఆత్మవంచన చేసికోవటం కంటే దుఃఖభాజనమైన సంగతి వేరొకటి వుండదు. సరోజను నే నేనాడూ ప్రేమించి వుండలేదు. కాని, సరోజ.... సరోజ.... నాకు సాంత్వన కలుగ జేస్తున్నది. నన్ను ప్రేమిస్తున్నది.

"అలానా, అయితే ఎందుకు పిలిపించలేదు. రమ చేత కబురంపాల్సింది కదూ."

నేను సరోజ ముఖంలోకి చూస్తున్నాను.

"నే నెప్పుడైనా మీరు పిలుస్తున్నారంటే రానంటానా. మీ గుండెల్లో నన్నునుకుంటే నేనే వచ్చి వాల్తానుకదూ."

నాకు వెంటనే మైథిలి గుర్తొచ్చింది.

అబ్బ! దుస్సహ విషాదగాథ!

ఆనాళ్ళ, ఆరోజు నేను ఇలానే మంచంలో జ్వరంతో మూలుగుతూవుండగా మైథిలి ఇలానే అన్నది.

ఏ నాటి మాట!

నా గుండెలో రగులు విషాద స్మృతి అది.

ఆనాడు మైథిలి అలానే అలంకారాలలో మెరిసిపోతూ నావద్దకు వచ్చింది.

నేను మంచంలో వున్నాను.

మైథిలి పక్కనున్న కుర్చీలో కూర్చున్నది.

"నువ్వు వస్తావనే ఆశ అంతరాళ్లో ఎక్కడో తళుక్కు మని మెరుస్తున్నది. ఇంతలో మళ్ళీ అంత అదృష్టమా అని అనిపిస్తోంది. కాని, చివరకు నా ఆశ జయించింది. నువు వచ్చావు."

"చిత్రంగా మాట్లాడుతావు" మైథిలి అందంగా విసుక్కుంది.

"అతిథులంతా వెళ్ళిపోయారా?"

"నాకు విసుగు పుట్టి పరుగెత్తుకొచ్చాను.

"ఏం..."

"నువ్వే నయం. వాళ్ళు అలా మాట్లాడుతారు బాబూ"

దానిమ్మపళ్ళు చేతిలో పెట్టబోయ్యాను.

"తినితినీ చచ్చిపోయాను. ఇవాళంతా తినటమే" అంది మైథిలి అలసటను సూచిస్తూ అందంగా,

" ఆ అదృష్టం నాకు లేక పోయె" అన్నాను. మైథిలి నవ్వింది.

ఆ నవ్వు చూస్తే నాకు వళ్ళు జలదరిస్తుంది.

ఆ నవ్వు గగనధునీ వికసితాంభోజము నవ్వినట్లుగా వుంటుంది. ఆ నవ్వు ఊహా కందనిది. మాటలకు చెందనది. శీతకాలపు ఎండ లాంటిది.

"మైథిలీ" అన్నాను తీపులు పండిన ద్రాక్షగుత్తితో.
"ఏమిటి, నువ్వు కూడా ఏదో ప్రార్థన మొదలెట్టేలా వుంది. దండకాలు చదివితే మళ్ళీ రాకుండా పారిపోతాను సుమా!"

నా గొంతు మూగవోయింది.

నేను మైథిలికేసి చూస్తూ కాలాన్ని గడపసాగాను.

మా వదిన కాఫీ తీసుకొచ్చింది.

ఒక్కొక్క చుక్క పెదాలు తడుపుతుండగా మైథిలి నాకేసి చిత్రంగా చూసింది. ఆ చూపులోని భావం ఏమని చెప్పను ?

ద్రాక్ష గుత్తిలోని ఓ పండు నోట్లో వేసుకుంటూ "నేను రెండు రోజుల్లో ఊరి కెళ్తున్నాను" అన్నది.

నాకు ఆ మాట మధురంగా ధ్వనించలేదు. "మళ్లీ వారంలో తిరిగి వస్తాను".

ఈ మాటలు నా కొకింత సాంత్వన.

నా కళ్ళల్లోకి చూస్తూ అలానే కూచుండి పోయింది.

కొద్దిసేపు గడచిన తర్వాత "నా జ్వరము తగ్గేంత వరకూ వుండకూడదా ఇక్కడే" అన్నాను దిగులుగా. మైథిలి నాకేసి చిత్రంగా చూసింది. చిన్న పిల్లలాగ "ఎందుకంత భయం ?" అంది.

"నువ్వు లేకపోతే నాకు జ్వరం తగ్గదేమో?"

"ఛా, ఛా, రోజు రోజుకి చిన్న పిల్లాళ్ళు...." తరువాతి మాట పూర్తి చేయలేదు.

"ఇప్పుడేమంత అవసరం, నువ్వు వెళ్లాలా?" అన్నాను.

"మా మేనమామకి జబ్బుగా వుందట. నేను వెళ్లి చూసి రావాలి. పోనీ ఐదు రోజుల్లో వస్తాను లేచ్చా. దిగులుపడకు"

మైథిలి అమ్మవలె మాట్లాడగలదు.

"నీ ఇష్టం" అన్నాను.

లేచి లైటు వెలిగించింది.

"నీ కోసం అతిథులెవరైనా వస్తారేమో కాస్త ఆలస్యంగా కూడా వస్తుంటారుగా, ఇక వెళ్లు" అన్నాను.

"ఏం మునిగి పోలేదులే, నువ్వు రాకపోయిన తర్వాత ఎవరు వచ్చినా...." తర్వాత ఏమి చెప్పటానికి తోచలేదు. మైథిలి కళ్లు మిలమిలా మెరిశాయి.

నిన్న సాయంత్రం అన్నయ్యని బ్రతిమిలాడి ఓ ఉంగరం తెప్పించాను. నీలపు రాయితో ముద్దులు మూటకడుతున్నది. పొద్దుటినుంచి ఇవాళ నేను లేవగలననీ, అందరి అతిథుల వలెనే నేనూ మైథిలి వద్దకు వెళ్లగలననీ దీనిని ఆమె పుట్టినరోజు కానుకగా బహూకరించ గలననీ ఆశించాను. కాని, నా ఆశ నిరాశ అయి పోయింది. మరి నీరసం వచ్చిపడింది. అలానే నేను లేచి వెళ్ళగలను. కాని, వదిన నన్ను యీ శయ్యను విడువ నియ్యదు. అన్నయ్యకు తెలిస్తే బాగుండదు.

ఇలా దైన్యంతో కొట్టుమిట్టాడుతున్నాను. నా ఆత్మ మైథిలిని అంటి పెట్టుకునే వుంది. నీరసించినా నా శరీరం యీ పక్క మీద పడుకుని వుంది. కాని ఎక్కడనో, ఏ మూలో

మినుకు మినుకు మనే దీపిక నాలో ఉజ్జ్వలంగా ప్రకాశించింది. నా ఇంటికి మైథిలి వచ్చింది. వస్తూనే నాకు వెలుగు తెచ్చింది. ఇంతలో వన్నెలనూ........

ఇక నాకు భయం లేదు.

కాని మైథిలి ఊరినుంచే వెళ్ళిపోతున్నదట.

ఈ తలంపునన్ను నిలువనియ్యదు.

కాని మైథిలి... వెళ్ళాలి. వెళ్ళక తప్పదు.

నేను అనుకుంటున్నట్లు కాకుండా తాను వెళ్ళిపోతున్నట్లు నాకు తెలియజెయ్యటానికి వచ్చిందేమో!

ఎందుకీ ఆలోచనలు నన్నిలా వేధిస్తున్నాయి. నాలోని దుర్బలత్వాన్ని విధంగా ఆలోచనలకు వశుణ్ణి చేస్తున్నది. మైథిలి చెయ్యి చేతిలోకి తీసుకున్నాను. తలగడ క్రింద చిన్న భరిణలోని ఉంగరాన్ని తీసుకుని వేలికి తొడిగాను. మైథిలి వదనం రాగరంజితమైంది.

“ఇది నీ పుట్టినరోజు కానుక. ఇంతకన్నా ఇంకేమీ ఇవ్వలేకపోతున్నాను. బీదవాణ్ణి – అనుగ్రహించు” అన్నాను.

మైథిలి చిన్ననవ్వునవ్వి “అనుగ్రహించాను” అన్నది. ప్రసన్నమైన దేవి భక్తునితో వలె.

“మరి వెళ్ళొస్తాను. ఉత్తరం రాస్తానులే” అంటూ వెళ్ళిపోయింది. వాకిలి దాటేవరకూ నాకళ్ళు ఆ సుపిప్రును స్పృశిస్తూనే ఉన్నాయి. ఆమె వెళ్ళిపోయింది. ఆ రాత్రి నాకు సుఖంగా నిద్రపట్టింది. మళ్ళీ జ్వరం తగ్గిపోయింది.

రెండురోజులు గడిచాయి. మూడురోజులు గడిచాయి. వారం గడిచింది. మైథిలి రాలేదు. మైథిలినుంచి ఉత్తరం కూడా రాలేదు.

పదిరోజులైంది. అబ్బ! ఆ రోజు ఎంత చెడ్డరోజు. మైథిలి ఉత్తరం వ్రాసింది.

తనకు తీవ్రంగా జ్వరం వస్తున్నదట. హాస్పిటల్లో అడ్మిట్ చేశారట. వెంటనే వచ్చేయి, వస్తావుకదూ. గాభరా లేదులే. ఇదీ సారాంశం.

నేను వెళ్ళాను.

చిక్కి పుల్లలాగా నీరసించి పోయింది.

ముఖం చాలా కళగా వుంది.

ముఖమంతా వెలిగిపోతూండగా పెదవులమీద ఎందుకా చిరునవ్వు.

“నేను బ్రతకనేమో!?”

....................

“ఎందుకలా నేరం చేసినవాడిలా నిలబడతావు చూడు. నా కళ్ళలోకి చూడు.”

....................

“ఛీ, పిచ్చబ్బాయీ...”

నేను అక్కడే వంగి అటూ ఇటూ చూసి వేడిగా వాడిపోతున్న పాదాల్ని ముద్దెట్టుకున్నాను.

అంత నీరసంలోను ఎంతకోపం !

కాళ్ళు చప్పున పైకి లాక్కున్నది.

"ఇలా రా"

కొంగు వేలికి చుట్టుకుని నా కళ్ళు తుడిచింది.

"ఇంకా నీకు బలం రాలేదు. అలా కూచో. ఇదుగో యీ బిస్కట్లు కాసినితిను. ఇవిగో ఫ్లాస్కులో కాఫీవున్నది..."

...................

"ఎందు కలా గుడ్లప్పజెప్పి కూచుంటావు. మూగనోము పట్టావా? నా కోపమొస్తే నేనసలు మంచిదాన్ని కాదు."

నేను మాట పెగల్చుకుని —

"నువ్వెందు కామాట అన్నావు 'నే బ్రతకనేమో' అని. నువ్వు బ్రతక్కపోతే నే నెవరి కోసమని బ్రతకాలి?"

మైథిలి ఒక్క నవ్వు నవ్వింది. ఆ క్షణాన్ని నాలో జీవన జ్యోతి ఆరిపోనంతవరకూ మరచి పోను. ఆ నవ్వు అర్థమేమిటి? ఎందు కలా నవ్వింది? ఇప్పుడు ఇన్నాళ్ళ తర్వాత ఎప్పుడైనా నాకు ఆక్షణం గుర్తుకొస్తే గిలగిలలాడిపోతాను. ఇవాళ మైథిలి లేదు. ఏ నాడో లేదు. కాని. ఆ నవ్వు నా గుండెల్లో పదిలంగా వుంది. దాని అర్థం "ఈ నీ మాటలన్నీ అబద్ధం, నే చని పోతే నువ్వు ఎవరి కోసమో మరొకరికోసం బ్రతుకుతావు. ఎందు కలా నిన్ను నువ్వే వంచించుకుంటావు. అనేమో! అనునేమో! అనవచ్చు.

సరోజ ఎప్పుడో క్రిందికి వెళ్ళింది.

ఇంత సేపూ నేను నిద్రపోతున్నానా ?

—సరోజ నా చెంపలు రాస్తూ, మెల్లిగా లేపుతున్నది. లేపి కూచునేట్లు చేసి, నోటికి కాఫీ అందిస్తున్నది. గుండె రాస్తూ "ఇప్పు డెలా వున్నది; కాస్త తాగిన వచ్చిందా ? ఇక నిద్రపోకండి, అబ్బ ! కటిక చీకటి."

చీకటి పడ్డది.

సరోజ లేచి లైటు వెలిగించింది.

కిటికీ రెక్కలు తెరిచింది.

గది నిండిన చీకటి రెక్కలు విప్పుకుని కిటికీలోంచి ఎగిరి పోయింది.

నా సరోజ నాకు మిగిలింది.